25082024-DIS-04_Layout 1 8/25/2024 2:40 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని బయటపడ్డాం

ఆవుల సరిత యాదవ్
95539 55313

2008, హెచ్ఎంటీవీలో ట్రైనీ జర్నలిస్టుగా మొదలైన నా పాత్రికేయ ప్రయాణం ఆ తర్వాత 'టీ' న్యూస్, ఇప్పుడు 'తెలుగు స్క్రైబ్'లో కంటెంట్ హెడ్‌గా కొనసాగుతున్నది. పాత్రికేయురాలిగా ప్రజలకు నేనందించిన సేవలను గుర్తించిన నాటి ప్రభుత్వం నన్ను ఉత్తమ జర్నలిస్టుగా గుర్తించింది. ఇదంతా ఇప్పుడెందుకు చెప్తున్నానంటే..? నిజం గడప దాటేలోపు అబద్ధం ఊరంతా చుట్టేస్తుందన్నట్టు.. 'ఆవుల సరిత అసలు జర్నలిస్టే కాదని', 'ఆమె ఒక రాజకీయ పార్టీకి చెందిన కార్యకర్త' అంటూ అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారాలు చేశారు. నేనేంటో, గత 16 ఏండ్లుగా నాతో పాటు పనిచేసిన జర్నలిస్టులందరికీ తెలుసు. కానీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో చెప్పే అబద్ధాలు ఒకరిద్దరు నమ్మే అవకాశాలు కూడా ఉంటాయి. కాబట్టి, నా గతాన్ని ఒకసారి మీకు పరిచయం చేస్తున్నాను. ఇక అసలు విషయానికి వస్తే.. 16 ఏండ్ల నా జర్నలిజం ప్రస్థానంలో 2024, ఆగస్టు 22 ఒక చీకటి రోజు. అదొక దుర్దినం. ఆ రోజు అసలేం జరిగిందంటే..?

***

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరినప్పటి నుంచి 'రుణమాఫీ'పై చర్చలు జరుగుతున్నాయి. గత నెల రోజులుగా ఆ చర్చలు జోరందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నాకు తెలిసిన కొంతమంది రైతులతో మాట్లాడినప్పుడు పాపం వాళ్లకు రుణమాఫీ కాలేదనే విషయం తెలిసింది. ఓ వైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులు ఒకేసారి రైతులందరికీ మొత్తం రుణమాఫీ చేశామని చెప్పుకుంటున్నారు. ఇంకోవైపు రైతులేమో మాకు రుణమాఫీ కాలేదంటున్నారు. దీంతో ఎవరు నిజం చెప్తున్నారో?, ఎవరు అబద్ధం చెప్తున్నారో నాకు అర్థం కాలేదు. అందుకే ఫీల్డ్‌లోకి వెళ్లి రుణమాఫీపై కేస్ స్టడీ చేయదలచుకున్నాను. అందులో భాగంగానే పది రోజుల కిందట ఓ రోజు మెదక్ నియోజవర్గంలోని ఒక ఊరుకు వెళ్లాను. అక్కడి రైతులతో మాట్లాడితే చాలా మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదనే చెప్పారు. రుణమాఫీ అంశంపై రైతులతో మాట్లాడేందుకు రాష్ట్రం మొత్తం కలియదిరగాలని అప్పుడే, ఆ క్షణమే అనుకున్నాను. ఆ తర్వాత మునుగోడు నియోజకవర్గంలోని సర్వేల్, సంస్థాన్ నారాయణపూర్, మల్లారెడ్డిగూడెంతో పాటు ఇతర గ్రామాల్లోనూ నాతో పాటు మా ఛానల్ జర్నలిస్టులు సందర్శించారు.

2024, ఆగస్టు 22 గురువారం రోజు ఉదయం 6 గంటలకు సోమాజిగూడ నుంచి కొండారెడ్డిపల్లికి మా కారు బయల్దేరింది. 'మిర్రర్ టీవీ' ప్రతినిధిగా జర్నలిస్టు సోదరి విజయారెడ్డి కారు కూడా మాకు తోడైంది. ఆమెతో సహా అందులోనూ ముగ్గురు వ్యక్తులున్నారు. కొండారెడ్డిపల్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ఊరు. కొండారెడ్డిపల్లిలో ఇలా కాలుపెట్టామో లేదో.. ఎడమవైపున పాల కేంద్రం కనపడింది. పాల కేంద్రంలో రైతులు ఎక్కువగా ఉంటారనే ఆలోచన రావడం, డ్రైవర్‌కు ఆపమని చెప్పడంతో ఆయన కారుకు బ్రేకులు వేశాడు. వెంటనే మా కెమెరామెన్ మైక్, కెమెరాలతో సిద్ధమయ్యాడు. అప్పటికే ఉదయం 9 అవుతున్నది. కారులోంచి దిగిన మేం ముగ్గురు రైతులతో మాట్లాడినం. 'మీకు రుణమాఫీ అయిందా?' అన్న మా ప్రశ్నకు ముగ్గురూ 'మాకు కాలేదు' అని చెప్పారు. అక్కడి నుంచి మా కార్లు కదిలి, కొంచెం ముందుకువెళ్లిన తర్వాత కిరాణా దుకాణం వద్ద జన సమూహం కనపడటంతో అక్కడ ఆగాయి. అక్కడ కూడా నలుగురు రైతులతో మాట్లాడినం. ఆ నలుగురు రైతులూ 'మాకు రుణమాఫీ కాలేదు' అనే చెప్పారు. మేం అక్కడనే ఉన్నాం. అటుగా వెళ్తున్న ఇద్దరు రైతులను రుణమాఫీపై ప్రశ్నిస్తే.. ఒక రైతేమో 'నాకు రుణమాఫీ అయ్యింది' అని చెప్పగా, ఇంకో రైతు 'నాకు రుణమాఫీ కాలేదు' అని చెప్పాడు. అయితే అప్పుడే అక్కడికి వచ్చిన మరో రైతును ప్రశ్నిస్తే.. 'రుణమాఫీ కాలేదని చెప్తే మమ్మల్ని కొట్టి చంపుతరమ్మా... మా ఊరోళ్లు, అసలే మంచోళ్లు కారు' అని చెప్పడం గమనార్హం. కొండారెడ్డిపల్లిలో ఉన్న రైతులను 'మీ ఊళ్లో ఎన్ని క్రాప్ లోన్లున్నాయి, ఎంత మందికి మాఫీ అయ్యింది' అని అడిగితే.. 'వెయ్యి నుంచి పదకొండు వందల మందికి క్రాప్‌లోన్లుంటే... మూడొందల మందికే మాఫీ అయిందని' చెప్పారు.

కిరాణా దుకాణం నుంచి రేవంత్‌రెడ్డి ఇల్లు పక్కన కొంచెం అటూ ఇటుగా ఉన్న గ్రామపంచాయతీకి మా కార్లు బయల్దేరినయి. అయితే, అప్పటికే రెండు వాహనాలపై నలుగురు వ్యక్తులు మా కదలికలను గమనిస్తున్నారనే విషయాన్ని మేం పసిగట్టలేకపోయాం. మా కార్లు గ్రామ పంచాయతీకి చేరేసరికి ఆ రెండు వాహనాలు కాస్తా నాలుగయ్యాయి. ఆ నాలుగు కాస్తా ఎనిమిది అయ్యాయి. ఇలా పంచాయతీలో కారు ఆపి ఇలా మేం దిగామో, లేదో.. మా చుట్టూ సుమారు వంద మంది గుమిగూడారు. ఒకతను.. 'మీరెవ్వరు? ఎందుకు కొండారెడ్డిపల్లికి వచ్చారు?' అని అడిగాడు. 'మేం జర్నలిస్టులం, రుణమాఫీపై ప్రజల స్పందనను తెలుసుకునేందుకు వచ్చాం' అని చెప్పడంతో.. 'మా కొండారెడ్డిపల్లికి వచ్చేందుకు మీకెన్ని గుండెలు' అంటూ రాయలేని భాషలో దుర్భాషలాడటం మొదలుపెట్టారు. ఆ సమయంలో వాళ్లంతా రౌడీల్లా, నరరూప రాక్షసుల్లా వ్యవహరించారు. 'మీరు కేవలం రుణమాఫీ కాని రైతులతోనే మాట్లాడుతున్నారు, రుణమాఫీ అయిన రైతులతో మాట్లాడటం లేదు. మా ఊరు దాటి ఆ కెమెరాలు బయటికి ఎలా పోతాయో చూస్తాం' అంటూనే కెమెరాలు, మైక్‌లు, ఫోన్లు గుంజుకున్నారు. అడ్డుకున్న నా చున్నీని లాగారు. నెట్టేస్తే నేను వెళ్లి బురదలో పడిపోయాను. అడ్డుకున్న విజయారెడ్డి పైనా అదే తీరు. నాపై జరుగుతున్న దాడిని విజయారెడ్డి తన ఫోన్‌లో రికార్డు చేస్తుండగా ఆమె ఫోన్‌ను సైతం లాక్కున్నారు. ఈ పెనుగులాట గంటకుపైగా జరిగింది. ఆ తర్వాత బయటపడ్డ మేం ఎలాగోలా తప్పించుకొని ఒంగూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాం. పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న క్రమంలో మా కార్లపై రాళ్లతో దాడి చేశారు. పోలీస్‌స్టేషన్‌లో మేం పిటిషన్ రాస్తుండగానే విజయారెడ్డిని పిలిచి ఎస్సై ఫోన్ ఇచ్చేశాడు. 'ఇది ఎవరు ఇచ్చారు సార్' అనడిగితే 'ఊరిలో ఈ సెల్‌ఫోన్ దొరికిందని ఎవరో ఒకతను తీసుకువచ్చి ఇచ్చాడని' ఎస్సై చెప్పడం గమనార్హం.

> రక్షణ కోసం మా కార్లు వెంటనే వెల్దండ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. పోలీస్‌స్టేషన్ లోపలికి కార్లు వెళ్లే మార్గం లేకపోవడంతో గేట్లముందే కార్లు ఆపి దిగి లోపలికి వెళ్లే లోపు మా వెంటే నాలుగైదు కార్లు వచ్చి ఆగాయి. ద్విచక్ర వాహనాలపైనా రౌడీలు వచ్చారు. సుమారు అరువై మంది ఠాణాకు వచ్చారు. ఫోన్లు, కెమెరాలు ఇవ్వండంటూ మళ్లీ దాడులు మొదలుపెట్టారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే నాపై దాడికి ప్రయత్నించారు. మహిళా జర్నలిస్టులమని కూడా చూడకుండా ఆ రౌడీలు పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే రాయలేని భాషలో బూతులు తిట్టారు.

కంప్లయింట్ ఇచ్చి, హైదరాబాద్‌కు బయల్దేరాం. మేం హైదరాబాద్‌కు చేరుకోవాలంటే మళ్లీ కొండారెడ్డిపల్లి మీదుగా రావాల్సిందే.. మేం కొండారెడ్డిపల్లికి చేరుకోగానే.. నాలుగైదు కార్లు మా కోసం కాపు గాస్తున్నాయి. ఆ కార్లలోంచి మమ్మల్ని చూస్తున్న వాళ్లు చూపుడు వేలు ఊపుతూ బెదిరించారు. వాటిని మా కార్లు దాటగానే అవి మా వెనుకే వచ్చాయి. మేం ఎటు వెళ్తే అటే మమ్మల్ని ఫాలో అవుతున్నాయి. నాకు తెలిసీ మా కార్లు ఆగితే అక్కడ మమ్మల్ని కొట్టేవాళ్లేమో, ప్రాణాలతో మేం బయటపడేవాళ్లం కాదేమో.. ఇక గత్యంతరం లేదు, ఏదో ఒక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిందేనని గమనించిన మేం దగ్గరలో ఏ పోలీస్‌స్టేషన్ ఉందని గూగుల్‌లో సెర్చ్ చేస్తే.. వెల్దండ ఠాణా కనిపించింది. రక్షణ కోసం మా కార్లు వెంటనే వెల్దండ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. పోలీస్‌స్టేషన్ లోపలికి కార్లు వెళ్లే మార్గం లేక పోవడంతో గేట్లముందే కార్లు ఆపి దిగి లోపలికి వెళ్లే లోపు మా వెంటే నాలుగైదు కార్లు వచ్చి ఆగాయి. ద్విచక్ర వాహనాలపైనా రౌడీలు వచ్చారు. సుమారు అరవై మంది ఠాణాకు వచ్చారు. ఫోన్లు, కెమెరాలు ఇవ్వండంటూ మళ్లీ దాడులు మొదలుపెట్టారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే నాపై దాడికి ప్రయత్నించారు. మహిళా జర్నలిస్టులమని కూడా చూడకుండా ఆ రౌడీలు పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే రాయలేని భాషలో బూతులు తిట్టారు. మా కండ్లలోంచి నీళ్లు ఉబికివస్తున్నాయి. ఇది గమనించిన ఇద్దరు, ముగ్గురు కానిస్టేబుళ్లు మమ్మల్ని లోపలికి తీసుకువెళ్లి బ్యాక్‌సైడ్ తలుపులు క్లోజ్ చేశారు.

మా కెమెరామెన్‌లు తీసిన వీడియోల్లో ఒకటి సోషల్‌మీడియాలో షేర్‌చేశాం. అంతే.. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాగర్‌కర్నూల్ ఎస్పీతో మాట్లాడారు. ఆ ఎస్పీ ఆదేశాలతో మా రెండు కార్లకు పోలీస్ ఎస్కార్ట్ తోడైంది. భయం, ఆందోళనల మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాత్రి ఎనిమిదిన్నర ప్రాంతంలో హైదరాబాద్ పరిసరాలకు చేరుకున్నాం.

***

> తెలంగాణ ఉద్యమం తారస్థాయిలో ఉన్నప్పుడు జర్నలిస్టుగా సాగరహారం, సడక్ బంద్, సంసద్‌యాత్ర, వంటావార్పులతో పాటు అనేక ధర్నాలను, ఎన్నో కార్యక్రమాలను కవర్‌చేశాను. కానీ, ఏనాడూ ఇలా రౌడీలు నాపై దాడి చేయలేదు. ఒక్క నాపైనే కాదు, ఏ మహిళా జర్నలిస్టుపై కూడా దాడులు జరగలేదు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో తన సొంత ఊరైన కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులపై దాడి జరగడం ఏమిటో నాకైతే అర్థం కావడం లేదు. అసలు మన రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికే ఉన్నదా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ఊరు అయితే మాత్రం జర్నలిస్టులు వెళ్లకూడదా? రైతులతో మాట్లాడకూడదా? రైతులకు సంబంధించిన సమాచారాన్ని ఒక జర్నలిస్టుగా ప్రభుత్వానికి చేరవేయకూడదా? చేరవేస్తే తప్పవుతుందా?

చివరాఖరు: ప్రజల సుదీర్ఘ పోరాటాల తర్వాత తెలంగాణను ఇక ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించక తప్పదని కాంగ్రెస్ అధిష్ఠానం అందుకు సిద్ధమైంది. ఆ సమయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు సైతం అధిష్ఠానం చిన్న హింట్ ఇచ్చింది. ఆ సమయంలోనే హైదరాబాద్‌లో దాడులు జరగడం మొదలైంది. ఆ తర్వాతే అర్థమైంది. ఆ దాడులు ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావానికి సంకేతమని!

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి సుమారు తొమ్మిది నెలలు కావస్తున్నది. ఈ తొమ్మిది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకత మూటగట్టుకున్నది. నివురుగప్పి ఉన్న నిజాలను బయటపెడుతున్న నా లాంటి జర్నలిస్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం కిరాయి రౌడీలను ఉసిగొల్పుతున్నది, దాడులకు పాల్పడుతున్నది. మరి ఈ దాడులు ఇస్తున్న సందేశం?

జై తెలంగాణ! జై జై తెలంగాణ!!

దారితప్పిన రుణమాఫీ?

జీడిపల్లి రాంరెడ్డి
96666 80051

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. హామీల అమలు గురించి ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రజలతో పాటు ప్రతిపక్షాల బాధ్యత. తన బాధ్యత నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రధాన ప్రతిపక్షం మీద ఎదురుదాడికి దిగుతున్నది. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు సీఎం రేవంత్‌రెడ్డి.

అధికారంలోకి వచ్చేందుకు అలవిగాని హామీలిచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు వాటిని అమలుచేసేందుకు నానా తంటాలు పడుతున్నది. అర్థం పర్థం లేని నిబంధనలు పెట్టి 11 లక్షల మందికి పైగా కోత పెట్టారు. ఎన్నికల సమయంలో ప్రతి రైతుకు 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నేడు కుటుంబానికి రూ.2 లక్షలకే పరిమితం చేశారు. ఎన్నికలకు ముందు రూ.41 వేల కోట్లని చెప్పి, అధికారంలోకి వచ్చాక రూ.31 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని ప్రకటించి, బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లను కేటాయించి, ఆపై రూ.17 వేల కోట్లతోనే మాఫీ అయిపోయినట్లు ప్రకటించడం శోచనీయం. తెలంగాణవ్యాప్తంగా 70 లక్షల మంది రైతులకు గానూ 60 లక్షల మంది రుణాలు తీసుకోగా, ప్రభుత్వం మాత్రం 44 లక్షల మంది మాత్రమే రుణాలు తీసుకున్నట్లు చెప్తున్నది. ఇక వారిలోనూ 32.5 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి.. తీరా 22 లక్షల మంది రుణాలనే మాఫీ చేశారు.

బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. 1,11,027 ఫిర్యాదులు వచ్చాయంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ హరీశ్‌రావు రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం విడ్డూరం. మాయమాటలు మాట్లాడటం రేవంత్‌రెడ్డికి కొత్తేమీ కాదు. గతంలో కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఆయన సవాల్ విసిరారు. మరి ఆయన రాజకీయ సన్యాసం ఏమైంది? ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదు. ఆయనలో ఇంకా అప్పటి ప్రతిపక్ష నాయకుడే కనిపిస్తున్నారు. నోటికి ఏదొస్తే అది మాట్లాడుతూ సీఎం పదవికి మచ్చ తెస్తున్నారు.

రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతుల ఆందోళనలే కనిపిస్తున్నాయి. 'ఇదేం మాఫీ.. మాకు రుణమాఫీ చేస్తారా, లేదా?' అని రైతులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. రుణమాఫీ పూర్తయిందంటూ గప్పాలు కొడుతున్న కాంగ్రెస్ నాయకులు, పాలాభిషేకాలు చేస్తున్న కార్యకర్తలు ఆందోళన చేస్తున్న రైతులకు సమాధానం చెప్పాలి.

కేసీఆర్ హయాంలో రెండుసార్లు రుణమాఫీ జరిగింది. మొదటి పర్యాయం 35.31 లక్షల మంది రైతులకు రూ.16,144 కోట్లు, రెండో పర్యాయం 22.98 లక్షల మంది రైతులకు రూ.13,000 కోట్ల పంట రుణాలు మాఫీ అయ్యాయి. కానీ, ఇలా లొల్లి జరగలేదు. రేషన్‌కార్డులో పేరు లేదని, పేర్లు తప్పుగా ఉన్నాయని, చిన్నాచితకా తప్పులు ఉన్నాయని, ఇతర సాంకేతిక కారణాలు చెప్తూ కొర్రీలు పెడుతున్నారు. బ్యాంకుల చుట్టూ పాస్‌బుక్‌లు, ఆధార్‌కార్డులు పట్టుకొని రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మండల వ్యవసాయాధికారులు స్పందించడం లేదు. అలాంటి తప్పులే ఉన్నప్పుడు రుణాలు ఎలా ఇచ్చినట్టు? అప్పుడు ఈ తప్పులు కనిపించలేదా? అంతేకాదు, రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్నవారు అదనపు మొత్తాలను ముందుగా చెల్లిస్తేనే మాఫీ చేస్తామని చెప్పడం సరికాదు. పంట పెట్టుబడులకే ఇబ్బందులు పడుతున్న రైతులు ఆ సొమ్మును ఎక్కడి నుంచి తేవాలి?

ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఈ విషయమై మొదటినుంచీ కాంగ్రెస్ సర్కార్‌పై ఒత్తిడి తెస్తూనే ఉన్నది. కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర నేతలు రైతుల పక్షాన పోరాడుతూనే ఉన్నారు. అందుకే ప్రశ్నిస్తున్నవారిపై దాడులకు కాంగ్రెస్ తెగబడుతున్నది. అందులో భాగంగానే సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడి జరిగింది. తాజాగా సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో దాడి జరిగింది. అంతేకాదు, సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లిలో రుణమాఫీ అమలు తీరుతెన్నుల గురించి తెలుసుకునేందుకు వెళ్లిన జర్నలిస్టులపై కూడా దాడులు జరిగాయి. ఇలాంటి చిల్లర పనుల వల్ల ప్రభుత్వానికే నష్టం. ఇప్పటికైనా హామీలపై కాంగ్రెస్ సర్కార్ దృష్టి సారించాలి. లేనిపక్షంలో ప్రజలే బుద్ధిచెప్తారు. ■



కీలుబొమ్మలా సీబీఐ!

కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయాలా, వద్దా? అనే విషయమై తన వాదన వినిపించేందుకు సమయం కావాలని, మరో 14 రోజులు విచారణను వాయిదా వేయాలని సీబీఐ ఇటీవల న్యాయస్థానాన్ని కోరింది. అదే రోజు సీబీఐ అధికారులు మీడియాతో మరోలా మాట్లాడారు. ఆ వ్యాఖ్యలు పత్రికల్లో ఏకపక్ష హెడ్‌లైన్‌గా మారిపోయాయి. కేజ్రీవాల్ బయటకు రాకూడదనే ఉద్దేశంతోనే సీబీఐ ఇలా చేస్తున్నది. కేంద్రం ఆదేశాల ప్రకారమే సీబీఐ కీలుబొమ్మలా మారింది.

- మనీశ్ సిసోడియా, ఆప్ సీనియర్ నేత

> 'యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతాః' అని ఘోషించిన ప్రపంచంలో స్త్రీకి బతికి ఉండటమే పెద్ద వరమైపోయింది. బతికి ఉన్నవారికి కూడా అవమానాలు లేని బ్రతుకు మృగ్యమైపోయింది. అయినా అత్యుత్తమ వ్యక్తిత్వం ఉన్న మనుషులు ఉండవలసిన పార్లమెంటులో 151 మంది నేర చరిత్ర కలిగిన పురుషులున్న దేశంలో ఆడవాళ్ల పరిస్థితి హీనంగా, హేయంగా ఉండకుండా పూజనీయంగా ఉంటుందని ఆశించడం తెలివి తక్కువే కదా!

ఆకాశంలో సగం, భూమ్మీద అణువంత!

కనకదుర్గ దంటు
89772 43484

సర్దార్ పటేల్ విగ్రహానికి రూ.3,000 కోట్లు వెచ్చించిన బీజేపీ కేంద్ర ప్రభుత్వం సుమారు 70 కోట్ల స్త్రీ జనాభా రక్షణ కోసం రూ.100 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించడం హాస్యాస్పదం, అన్యాయం కాదా? గర్భవతి బిల్కిస్ బానోను అత్యాచారం చేసి, ఆమె కుటుంబ సభ్యులు 14 మందిని హత్యచేసిన వారికి పడని శిక్ష, ఒక్క డాక్టర్ మహిళను అత్యాచారం చేసి చంపిన ఒక్కడికి (మిగతా వాళ్లను ఎలాగూ దాచిపెట్టారు) పడుతుందని ఆశించగలమా? రెండేండ్ల నుంచి రావణకాష్ఠంలా మండుతున్న మణిపూర్ అత్యాచారుల మీద కేసులైనా పెట్టారా? ధర్మం కనీసం రెండు పాదాల మీదైనా నడిచింది కాబట్టి, ద్వాపరయుగంలో ద్రౌపదిని అవమానపడకుండా శ్రీకృష్ణుడు కాపాడాడు. మరి ఒంటికాలి మీద నడుస్తున్న ధర్మం ఈ కలియుగంలో ఆడవారిని ఎలా రక్షిస్తుంది.

> మేకప్ లేకుండా వాణిశ్రీని హీరోయిన్‌గా చూపగలిగిన సాహసి, బాపు డైరెక్షన్‌లో వచ్చిన 'గోరంత దీపం' సినిమాలో నాస్తికుడు ఆరుద్ర రచించిన 'రాయినైనా కాకపోతిని' అన్న అద్భుత రచన ఒక్కసారి గురుచేసుకుందాం.

'రాయినైనా కాకపోతిని రామపాదము సోకగా' అన్న మాట అహల్య శాప విమోచనం సూచిస్తుంది. కానీ, కలియుగ పురుషుల్లో, ముఖ్యంగా రాజకీయ నాయకులలో స్త్రీలు, అనుభవిస్తున్న ఈ వెతలు ఎవరు తీరుస్తారు? ఒక్క తెలంగాణ రాష్ట్ర సాధకులు కేసీఆర్ మాత్రమే తన పాలనలో ఈ విషయం గురించి మధించి, షీ టీమ్స్‌ను ఏర్పాటుచేసి 2014 నుంచి డిసెంబర్ 2023 దాక రాష్ట్రంలో స్త్రీలకు రక్షణ కల్పించారు. దేశంలో ఇటువంటి రెండో నాయకుడు కనపడటం లేదంటే అతిశయోక్తి కాదు. మళ్లీ 2024 నుంచి కథ మామూలే! ఆంధ్ర కుమారీ ఆంటీకి రక్షణ, తెలంగాణ మహిళా జర్నలిస్టులకు దెబ్బలు ప్రస్తుత ప్రభుత్వ పక్షపాత ధోరణికి అద్దం పడుతున్నాయి.

> ఇంతకూ స్త్రీలు ఏం కోరుతున్నారు? మణులా, మాన్యాలా? ఏమీ లేదు. తమంత తాము చదువుకొని, ఉద్యోగాలు చేస్తూ, చదువు లేకపోతే కూలీ, ఇతర పనులు చేస్తూ, సంపాదిస్తూ తమ బతుకు తాము బతుకుతామంటున్నా మగవారి అహంకారం, వివక్ష తగ్గటం లేదు. ఈ విషయంలో బీద, గొప్ప తేడా లేదు, కులాల ప్రసక్తి లేనే లేదు. దేశమంతా లింగవివక్ష సాగుతూనే ఉన్నది. చిన్న విషయాల దగ్గర్నుంచీ, అత్యాచార నేరాల వరకూ ఆడవారికి అవమానం, మగవారి వికృతచేష్టలకు మద్దతు దొరుకుతూనే ఉన్నాయి. దీన్ని అరికట్టడం ఎలా సాధ్యం?

బలహీనుడిని బలవంతుడు రక్షించేదే నిజమైన నాగరిక సమాజం. శారీరకంగా పురుషుడి కంటే బలహీనురాలైన స్త్రీ నైతికంగా, వ్యక్తిత్వ విలువలలో పురుషుడి కంటే ఎంతో బలవంతురాలు. ఈ విషయం, లింగ సమానత్వం గురించి విషయాలు విద్య ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారా అందరికీ అర్థమైనప్పుడే ఇటువంటి విజ్ఞానం పురుషులకు అబ్బుతుంది. అంతకంటే ముఖ్యమైనది ఏ నేరానికైనా ముఖ్యంగా స్త్రీల మీద, బలహీన వర్గాల మీద జరిగే అకృత్యాలకు శిక్షలు చాలా కఠినంగా ఉండాలి. చిన్న, పెద్ద ఏ నేరాలైనా భయపెట్టే శిక్షలు, వాటి అమలు సరిగ్గా ఉన్నప్పుడే సమాజం బాగుపడుతుంది. 'పది మంది నేరస్థులు తప్పించుకున్నా ఫరవాలేదన్న' మాట పోయి, ఒక నేరస్థుడు కూడా తప్పించుకోలేనిదే నాగరిక సమాజంగా మారుతుందన్న సత్యాన్ని గుర్తించాలి. ఒకరి జీవితం మీద ఇతరులకు మాట్లాడే హక్కే లేనప్పుడు ఆ జీవితాన్ని చిదిమేసే హక్కు ఎవరికి ఉంది? నేరస్థులకు ఉరిశిక్షలు అమానవీయం అయితే మరి అమాయకులను చంపడం అమానవీయం కాదా? 30 ఏండ్ల కిందట గుంటూరు దగ్గర దుండగులు బస్సుకు నిప్పుపెట్టిన సంఘటనలో 27 మంది సజీవ దహనమయ్యారు. ఆ దుండగుల న్యాయవాది వారిని ఉరి తీయకూడదని వాదించాడు. న్యాయానికే వారికి శిక్ష వేసే హక్కు లేనప్పుడు, పక్కవారిని చంపే హక్కు సామాన్యులకు ఉందా? బతికే హక్కు దుండగులకే ఉంటే మరి ఆ 27 మందికి బతికే హక్కు లేదా? ఇటువంటి వెర్రివాదనలు పక్కనపెట్టి శిక్ష రుజువైన ప్రతివారికి ముఖ్యంగా అత్యాచారం, హత్య వంటి సందర్భాలలో ఉరిశిక్షనే ఖరారు చేయాలి. ఒకసారి ఉరిశిక్ష పడ్డాక పైకోర్టులు అతను నేరస్థుడేనా అన్నది పరిశీలించాలి కానీ, శిక్ష తగ్గించకూడదు. ఇటువంటి నేరస్థులు ఇరవై కోట్ల మందిని ఉరితీసినా భారతదేశ జనాభాకి నష్టమేమీ లేదు.

ముఖ్యంగా మన పార్టీ వాడు, పరాయి పార్టీ వాడు అన్న భేదం అసలు పాటించకూడదు. కలకత్తా అత్యాచార సంఘటనను నిరసిస్తున్నవారంతా బిల్కిస్ బానో నిందితులను, మణిపూర్ ఘటనా నిందితులను, ముఖ్యంగా బ్రిజ్‌భూషణ్ వంటి రాజకీయవేత్తలను, నేరచరిత్ర ఉన్న రాజకీయ నాయకులను కూడా శిక్షించాలని కోరాలి. కలకత్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ వారు గురివింద గింజల్లా ప్రవర్తిస్తున్నారు. నిందితులెవరైనా కఠిన శిక్షలుంటేనే న్యాయం, ధర్మం పాటింపబడతాయని గ్రహించాలి. మానవత్వం కంటే, పార్టీ ఐడియాలజీ గొప్పది కాదు. ఒక్క నిందితుడు తప్పించుకోలేనిదే నిజమైన మానవీయ సమాజం అని గ్రహించాలి. ■